


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం మార్చి 27, 2026 సంపుటి : 2 సంచిక : 165 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4



## చిన్నారులకు నాణ్యమైన విద్య.. పోషకాహారం

» ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్‌తో రేవంత్ రెడ్డి

» సమగ్ర మానవాభివృద్ధి అంశంపై సమీక్ష

**హైదరాబాద్,మార్చి26 :**
రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి తో ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ గురువారం భేటీ అయ్యారు. రాష్ట్ర శాసనమండలి హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 0–10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహారం లోపం.. విద్యాభ్యాసన స్థాయి సామర్థ్యలోపాలకు సంబంధించి పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ సీఎం దృష్టిక తీసుకువచ్చారు. చిన్న వయస్సులో పోషకాహారం లోపంతో భవిష్యత్‌లో తలెత్తే ఆరోగ్య సమస్యలు.. ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన తెలియజేశారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను ఆయన సీఎంకు సూచించారు. ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం పెట్టేందుకు బ్జడెట్ లో కేటాయింపులు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందజేసేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందజేసేందుకు పోషణ సఖి పేరుతో మరొకరిని నియమించేందుకు అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు. కార్తీక్ మురళీధరన్ సూచించే అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు.

మిగతాద్ది 2 లో




## కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి ఫండ్స్ పెరగాలి

- ఇక్కడ పరిశ్రమలు ఉన్నవారు ఇక్కడే వెచ్చించేలా చూడాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం.

**హైదరాబాద్,మార్చి26**
తెలంగాణలో కంపెనీ లు,పరిశ్రమలు ఏర్పాటు చేసి సీఎస్ఆర్ ఫండ్స్ వేరే చోట ఖర్చు పెడతానంటే ఎలా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.



## జీవన్ రెడ్డి పార్టీని వీడడం బాధాకరం

### లోక్‌భవన్‌లో మహాష్టమి వేడుకలు

- శక్తి స్వరూపిణి అమ్మవారి పూజ
- పూజలో పాల్గొన్న గవర్నర్ దంపతులు

**హైదరాబాద్,మార్చి26**
శ్రీరామ నవమిని పురస్కరించుకుని చైత్ర నవరాత్రి మహాష్టమి వేడుకలు దివ్యశక్తి ఆరాధనకు ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. గురువారం లోక్ భవన్ అధ్వర్యంలో తెలంగాణలో తొలిసారిగా సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో చైత్ర నవరాత్రి మహాష్టమి ఫలహార వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణి జానకి శుక్లా తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. గత 35 సంవత్సరాలుగా తాను ఈ వేడుకల్లో భాగస్వామ్యం అవుతున్నానని, తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాను, ఈ పవిత్ర వేడుకను తొలిసారిగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లోనూ ఈ వేడుకలు తెలంగాణాలో కొనసాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. అమ్మవారి శక్తి స్వరూపమైన దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, మనలోని అజ్ఞానం, అహంకారం, దుర్గుణాలను తొలగించుకోవాలని సూచించారు. ఫలహార దీక్ష కేవలం ఆహార నియమం మాత్రమే కాకుండా, మనస్సు, శరీరం, ఆత్మలను శుద్ధి చేసే ఆధ్యాత్మిక పవిత్ర సాధనమని గవర్నర్ పేర్కొన్నారు. ఈ ఆచారాలు నియమశీలత, సహనం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా సమాజంలో శాంతి, సోదరభావం పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. పరస్పర గౌరవం, సహకారం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని సూచించారు. చివరిగా, మహాష్టమి సందర్భంగా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. వేడుకలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు,మాజీ గవర్నర్ దత్తాత్రేయ, బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, మల్క కొమురయ్య, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్,అదనపు డీజీపీ మహేష్ భగవత్,జిల్లా కలెక్టర్ హరి చందన, రాజ్ భవన్ సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు



## నిమ్స్‌లో చికిత్స పొందుతున్న గద్దర్ భార్య విమల

### పరామర్శించిన భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,మార్చి26 :**
దివంగత ప్రజా గాయకుడు గద్దర్ సతీమణి విమల నిమ్స్ లో గాల్ బ్లాడర్ సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. మూడు రోజుల క్రితం నిమ్స్ లో చేరిన విమల గారికి నేడు సర్జరీ జరగనుంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ లు కొద్దిసేపటి క్రితం నిమ్స్ లో డైరెక్టర్ బీరప్పను కలిసి విమల కు అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. విమల వెంట కుమారుడు సూర్యం కుటుంబ సభ్యులు ఉన్నారు.




## తెలంగాణ స్పీకర్ ట్రైబ్యునల్‌కు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్:**
ఎమ్మెల్యేల అనర్హత విషయంలో బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. స్పీకర్ ట్రైబ్యునల్‌కు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్ కుమార్‌కూ నోటీసులు జారీ చేసింది. పార్టీ మారిన ఇద్దరిపై స్పీకర్ ట్రైబ్యునల్ చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని వాదించారు. స్పీకర్ ట్రైబ్యునల్ నిర్ణయాన్ని రద్దు చేయాలని వాదించారు. కడియం, సంజయ్‌పై అనర్హత వేటు వేయాలని కోరారు.

## ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలు

### రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ తీర్మానం




- కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని నిర్ణయం
- 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటు
- వడ్డెర సంఘాలకు ప్రాధాన్యక్రమంలో ఖనిజ లీజులు
- ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

**అమరావతి,మార్చి26 :**
రాజధాని అమరావతి అంశంపై ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ, దానికి పూర్తిస్థాయిలో చట్టబద్ధత కల్పించేలా మంత్రివర్గం కీలక తీర్మానం చేసింది. గత కొంతకాలంగా సాగుతున్న న్యాయ, పరిపాలన పరమైన చిక్కులను తొలగించి, అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, పాలనపరమైన అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్–5ను సవరించాల్సిందిగా మంత్రివర్గం తీర్మానం చేసింది. కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది.



## దావోస్ పర్యటనలో రూ.2.19 లక్షల కోట్లు పెట్టుబడులు

- విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన శ్రీధర్ బాబు

**హైదరాబాద్,మార్చి26 :**
దావోస్ పెట్టుబడులు, ఎంవోయూలపై శాసనసభలో విపక్ష సభ్యులు చేసిన విమర్శలను మంత్రి శ్రీధర్‌బాబు తిప్పికొట్టారు. దావోస్ పర్యటనల్లో తెలంగాణకు రూ. 2.19 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. పెట్టుబడిదారులతో ప్రభుత్వం 44 ఎంవోయూలు కుదుర్చుకుందని వెల్లడించారు.ఈ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

2లో..

## భద్రాచలం అభివృద్ధికి మొత్తం రూ.586 కోట్ల నిధులు

- మొదటి దశలో రూ.351 కోట్లతో పనులు ప్రారంభం
- నేటు కళ్యాణోత్సవానికి హాజరవుతున్న సిఎం రేవంత్
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**భద్రాచలం,మార్చి26**
శ్రీ రాముడు నడయాడిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొదటి దశలో రూ. 351 కోట్లతో చేపట్టే పనులకు తెలంగాణ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మొత్తం రూ. 586 కోట్లతో రామాలయంతో పాటు భద్రాచలం

## ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి

- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు.. అంతా ఒకే గొడుగు కిందకు
- ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం
- ప్రతి సర్వేనెంబర్‌కు భూధార్ నెంబర్
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




మిగతాది 2లో

**హైదరాబాద్,మార్చి26 :**
తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ( ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా



## శాసనసభ్యులకు క్రీడా పోటీలు

- 28 29 తేదీల్లో రెండ్రోజుల పాటు నిర్వహణ
- మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి వెల్లడి

**హైదరాబాద్,మార్చి26**
రాష్ట్రంలో విద్యార్థులు యువకులు అన్ని వర్గాలకు క్రీడల ప్రాముఖ్యత తెలియజేసే విధంగా శాసన సభ్యుల క్రీడోత్సవాలు నిర్వహించబోతున్నామని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి లు తెలిపారు. ఈనెల 28 29 తేదీల్లో జరగబోయే శాసనసభ్యులు శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 నిర్వహణ సన్నాహక సమావేశం అసెంబ్లీలోని కమిటీ హాల్లో జరిగింది.

## కవిత కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి




- నేడు నిజామాబాద్ వేదికగా ప్రకటన
- రాజకీయ నిర్ణయాలు ప్రకటించే అవకాశం

**నిజామాబాద్,మార్చి26 :**
తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తూ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. తన రాజకీయ ప్రస్థానానికి పునాది వేసిన నిజామాబాద్ వేదికగానే ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించబోతున్నారు.

## రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ తీర్మానం

మొదటిపేజీ తరువాయి
అంతేకాకుండా నీరుకొండలో ఎస్ఆర్ఎం వర్సిటీ, 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణానికి క్యాబినెట్ అనుమతి ఇచ్చింది. అలాగే రాష్ట్రంలో 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటుకు ఆమోదం ఇచ్చింది. వడ్డెర సంఘాలకు ప్రాధాన్యక్రమంలో ఖనిజ లీజుల కేటాయింపులపై చర్చించారు. ఖనిజ లీజుల కేటాయింపులో ప్రీమియం, సీనరేజ్ ఫీజుల్లో 50శాతం రాయితీ ఇవ్వనున్నారు. కుప్పం బాలికల పాఠశాలలో పీఈటీ, నర్సు, రికార్డు అసిస్టెంట్ పోస్టుల మంజూరుకు ఆమోదం ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేసింది. జలవనరుల శాఖలో వివిధ ప్రాజెక్టుల ఆధునికీకరణ, మరమ్మతులకు పరిపాలన అనుమతులు ఇచ్చారు. వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది. కొత్త రాజధానిగా సీఆర్డీఏ చట్టం పరిధిలోని అమరావతి పేరు చేర్చాలని క్యాబినెట్ తీర్మానించింది. 28న అసెంబ్లీలో 4 గంటలపాటు చర్చించి తీర్మానించాలని నిర్ణయించింది. రాజధాని చరిత్రను ప్రజలకు తెలియ జేయాలని సీఎం చంద్రబాబు క్యాబినెట్‌కు సూచించారు. క్యాబినెట్ సమావేశంలో భాగంగా విద్యుత్ వ్యవస్థపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 5 నుంచి 14 లోపు ప్రతి నియోజకవర్గంలో 2 వేల చొప్పున సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పీఎం కుసుమ్ ద్వారా పవర్ లాస్‌లు తగ్గించేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాంకేతికత అందిపుచ్చుకుంటూ సంస్కరణలు తీసుకొస్తూ విద్యుత్‌శాఖ ముందుకెళ్లాలని సూచించారు. ఆదాయంలో 99శాతం జీతాలకే సరిపోతోంది. కేంద్ర సాయం అప్పులు, వడ్డీలు కట్టేందుకే సరిపోతోంది. క్లిష్టపరిస్థితు ల్లోనూ సంక్షేమం అందిస్తూ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్ర పథకాలను ఎక్కువగా మనం ఉపయోగించుకుంటున్నాం. ఈ పార్లమెంట్ భేటీలోనే రాజధానిగా అమరావతి చట్టబద్ధత సవరణ బిల్లు పెడతారు‘ అని సీఎం చంద్రబాబు అన్నారు.

## దావోస్ పర్యటనలో రూ.2.19 లక్షల కోట్లు పెట్టుబడులు

మొదటిపేజీ తరువాయి
దావోస్ పర్యటనల్లో 44 ఎంవోయూలు ప్రభుత్వం కుదుర్చుకుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రానికి రూ. 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. అసెంబ్లీలో దావోస్ పెట్టుబడులపై శ్రీధర్ బాబు మాట్లాడారు. పెట్టుబడులతో 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తాయని, 2024 దావోస్ లో 18 ఎంవోయూలు.. రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలియజేశారు. రూ.81,800 కోట్ల పెట్టుబడులతో 6 కంపెనీలకు భూముల కేటాయింపు జరిగిందని, భూముల కేటాయింపుతో ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం కేటాయించామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మరో 3 కంపెనీలకు రూ.30 వేల కోట్ల పెట్టుబడుల కోసం భూముల గుర్తింపు చర్యలు చేశామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో 11 కంపెనీలు కార్యకలాపాలు జరిగాయని అన్నారు. నిజామాబాద్ లో 681 సీట్ల సామర్థ్యంతో ఐటి టవర్ నిర్మించామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో ప్రస్తుతం 276 మంది ఉద్యోగాలు పనిచేస్తున్నారని అన్నారు. పెట్టుబడుల ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, పరిశ్రమల ఏర్పాటు వల్ల రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలు, ఉపాధి లభిస్తుందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

## భద్రాచలం అభివృద్ధికి మొత్తం రూ.586 కోట్ల నిధులు

మొదటిపేజీ తరువాయి
పట్టణాభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని మిథిలా కళ్యాణ మండపం వేదికగా స్వామివారి కళ్యాణం జరుగుతుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి తుమ్మల పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీసీతారామచంద్రస్వామి దంపతులకు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి సమర్పించనున్నారని తెలిపారు. అందుకు శుక్రవారం భద్రాచలానికి సీఎం రేవంత్ వస్తున్నారన్నారు. ఆయనకు ప్రజల తరఫున ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీ, ఎయిర్ పోర్టు ఏర్పాటు దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరిలో నావిగేషన్ సిస్టమ్ ఏర్పాటుకు అవకాశం ఉందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పనులు చేపట్టినట్లు చెప్పారు. సీతారాముల కళ్యాణం వీక్షించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై దేవాలయం అధికారులు, సిబ్బందికి మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

## కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి ఫండ్స్ పెరగాలి

మొదటిపేజీ తరువాయి
ఇప్పటి వరకు వచ్చిన సీఎస్ ఆర్ ఫండ్స్ మెరుగు గా లేవని అన్నారు. రాష్ట్రానికి మరిన్ని సీఎస్ఆర్ ఫండ్స్ రావాల్సిన అవసరం ఉందన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ మరిన్ని తెలంగాణ లో ఖర్చు పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సీఎస్ ఆర్ ఫండ్స్ ఎక్కువ ఖర్చు చేసిన వారిని గుర్తించి ప్రభుత్వం తరపున సత్కరించాలన్నారు. సీఎస్ ఆర్ ఫండ్స్ కోసం వెబ్సైట్ ఏర్పాటు చేయాలి..సీఎస్ఆర్ ఫండ్స్ ను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి..ఇతర రాష్ట్రాల్లో సీఎస్ఆర్ ఫండ్స్ కోసం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న సంస్థలు కనీసం 50 శాతం సీఎస్ఆర్ ఫండ్స్ కచ్చితం గా ఇక్కడే ఖర్చు పెట్టాలని, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్, సిఎంఓ ముఖ్యకార్యదర్శి శేషాద్రి,సిఎంఓ ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి,సిఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్ ,ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## చిన్నారులకు నాణ్యమైన విద్య..పోషకాహారం

మొదటిపేజీ తరువాయి
కార్తీక్ మురళీధరన్‌తో సమన్వయం చేసుకొని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, సెర్ప్ సీఈవో దివ్య, డిప్యూటీ సీఎం కార్యదర్శి కృష్ణభాస్కర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రుతి ఓజా, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి

మొదటిపేజీ తరువాయి
అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్- డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్?వసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నాకూడా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు. ఒక క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదేవిధంగా ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వేనెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్, వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ పక్రియ పూర్తయ్యేవరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్.ఎమ్.ఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూల్స్ ఉండగా భూభారతి పోర్టల్‌లో ఒకే ఛాప్టర్ కింద తీసుకువచ్చామన్నారు.

ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.

## శాసనసభ్యులకు క్రీడా పోటీలు

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనునిత్యం రాజకీయాల్లో బిజీ ఉండే శాసన సభ్యులు శాసనమండలి సభ్యులకు ఈ క్రీడా పోటీలు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని క్రీడల పట్ల అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పోటీలు మొట్టమొదటి సారిగా నిర్వహించబోతున్నామని, పార్టీలబేధ భావాలు పక్కనపెట్టి శాసనసభ్యులు అందరూ ఈ క్రీడల్లో పాల్గొన్న పోతున్నారని వారు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి వయసుల వారికి క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.ఇందుకోసం శాసనసభ సచివాలయము తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మరియు రాష్ట్ర సాంస్కృతిక శాఖ తోపాటు వివిధ శాఖల సమన్వయంతో శాసనసభ్యులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్ శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ యశస్విని రెడ్డి , పాల్వాయి హరీష్ రావు, శాసనమండలి సభ్యులు తాత మధుసూదన్ రావు భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి శాసనమండలి కార్యదర్శి నరసింహచార్యులు శాసనసభ కార్యదర్శి ఆర్ తిరుపతి వివిధ క్రీడా వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 ప్రారంభ వేడుకలు ఎల్బీ స్టేడియంలో 28వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమవుతాయని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తోపాటు ఉభయ సభల వివిధ పక్ష నేతలు విప్ లు అన్ని పార్టీల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.

## కవిత కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి

మొదటిపేజీ తరువాయి
శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించే అధికారిక సమావేశంలో ‘తెలంగాణ ప్రజా జాగృతి‘ పేరుతో కొత్త పార్టీని ఆమె ప్రకటించనున్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకల తేదీని కూడా అదే వేదిక నుంచి వెల్లడించేందుకు సర్వం సిద్ధమైంది. రాబోయే నెలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పార్టీ జెండా, అజెండా , పార్టీ గుర్తును ప్రజల ముందుకు తీసుకురావాలని కవిత భావిస్తున్నారు. ఈ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పెద్ద ఎత్తున చేరికలు ఉండేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. కేవలం పార్టీ ప్రకటనకే పరిమితం కాకుండా, కవిత రాబోయే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే అంశంపై కూడా ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గతంలో నిజామాబాద్ ఎంపీగా ఐదేళ్ల పాటు పనిచేసిన అనుభవం ఉండటంతో, అదే పార్లమెంట్ పరిధిలోని బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె బరిలోకి దిగుతారని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

కవిత ఈ కొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకోవడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలలో ఒక్కసారిగా గుబులు మొదలైంది. ముఖ్యంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ వంటి నేతలు కవిత నిర్ణయంతో ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కవిత వెంట ఎంతమంది కీలక నేతలు నడుస్తారు, ఎంతమంది మాజీ ఎమ్మెల్యేలు ఆమె పార్టీలో చేరతారనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదిగే లక్ష్యంతో వస్తున్న ఈ కొత్త పార్టీ, భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.

## ఇరాన్‌కు మరోమారు ట్రంప్ వార్నింగ్ ఆలస్యం చేస్తే పరిస్థితులు మారిపోతాయి

**- త్వరగా ఒప్పందానికి రావాలని హెచ్చరిక**

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందం విషయంలో మరీ ఆలస్యం చేస్తే పరిస్థితులు తీవ్రంగా మారిపోతాయని హెచ్చరించారు. అమెరికాతో ఒప్పందం కోసం ఒకవైపు ప్రయత్నిస్తూనే, బయటకు మరోలా మాట్లాడుతోందని ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ఆలస్యం కాకముందే సీరియస్‌గా వ్యవహరించడం మంచిదని హితవు పలికారు.’ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమైంది. తిరిగి పుంజుకునే అవకాశం లేదు. దీంతో వారు ఒక ఒప్పందం కోసం మమ్మల్ని వేడుకుంటున్నారు. మరోవైపు మా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. వారు చాలా తప్పు చేస్తున్నారు. మరీ ఆలస్యం కాకముందే వారు ఒక నిర్ణయం తీసుకుంటే మంచిది. ఆలస్యమైతే వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు. పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి’ అని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా హెచ్చరించారు. అమెరికాతో చర్చల పట్ల ఇరాన్ భిన్నంగా ప్రకటనలు చేస్తోంది (ఎసజీని జా ఇనీన్గొ÷తిఇబి). ఘర్షణలు ముగించేందుకు చర్చలు జరిపే ఉద్దేశం ఉద్దేశం తమకు లేదని, అమెరికా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. అమెరికాతో చర్చలు జరుగుతున్న సమయంలో పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులకు పాల్పడుతోంది.

## భార్యాభర్తలుగా నాటకాలు

**- దొంగతనాలు చేసేందుకు జట్టుకట్టిన నేపాలీలు**
**- జూబ్లీహిల్స్ దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు**

హైదరాబాద్‌లో సంపన్నుల ఇళ్లను టార్గెట్ చేసుకుని దోపిడీ చేస్తున్న నేపాలీ గ్యాంగ్ ఆట కట్టించారు పోలీసులు. ఇటీవల జూబ్లీహిల్స్‌లోని ఓ ఇంట్లో పని మనుషుల్లా నటించి.. ఆ ఇంటికే స్కెచ్ వేసి దాదాపు 2 కోట్ల రూపాయలకు పైగా సొత్తు దోచుకు వెళ్లిన గ్యాంగ్‌ను పట్టుకున్నారు. వారి పేర్లు మహేష్ షాహీ, అప్సర. నిజానికి ఇద్దరికీ సంబంధం లేదు. కానీ.. నేపాల్ నుంచి హైదరాబాద్‌లో అడుగు పెట్టిన ఈ జంట.. చోరీలకు స్కెచ్చేశారు. అందుకోసం తాము భార్యభర్తలం అంటూ నాటకం మొదలు పెట్టారు. సంపన్నుల ఇళ్లను టార్గెట్ చేశారు. అక్కడ పని మనుషులుగా చేరేందుకు ప్రయత్నించారు. చివరకు జూబ్లీహిల్స్ రోడ్ నెం 25లోని ఓబుల్‌రెడ్డి స్కూల్ సమీపంలోని ప్లాట్ నెంబర్ 305లో పింగళి అనిరుధ్‌రెడ్డి, దీపికారెడ్డి దంపతుల ఇంట్లో వారికి ఉద్యోగం దొరికింది. ఇక అక్కడి నుంచి తమ స్కెచ్ అమలు చేసేందుకు ఎదురు చూశారు మహేష్ అండ్ అప్సర. ఇంటి యజమానులు ఎప్పుడెప్పుడు బయటకు వెళ్తుంటారు? ఎప్పుడు తిరిగి వస్తుంటారు? ఇలా ఈ విషయాలపై రెక్కీ నిర్వహించారు. మరోవైపు అనిరుధ్ రెడ్డి, దీపికా రెడ్డి దంపతులు ఊటీ, కూర్గ్ తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో మార్చి 5న వారిద్దరూ ఇంటికి తాళం వేసి వ్యాపారం పనిమీద ఊటీ వెళ్లారు. ఆ ఇంట్లో 45రోజుల క్రితం భార్యాభర్తమంటూ తోటమాలీగా పనిలో చేరిన మహేష్ షాహీ అలియాస్ ప్రకాష్, అప్సర అలియాస్ మాయ.. మరో ముగ్గురు నేపాలీ గ్యాంగ్ సభ్యుల సహకారంతో మార్చి 13న అర్ధరాత్రి తర్వాత కట్టర్స్, రాడ్స్‌తో ఇంట్లోకి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లోని అల్మారాలను పగలగొట్టి సుమారు రూ.2కోట్ల విలువైన డైమండ్ నెక్లెస్‌లు, రాడో వాచ్‌లు, బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించారు. ఈ ఘటనలో నిందితులను పట్టుకునేందుకు జూబ్లీహిల్స్ క్రైం పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసుల ప్రత్యేక బృందాలు దేశంలోని పలు నగరాలతో పాటు నేపాల్ సరిహద్దుల్లో మొహరించారు. కాగా చోరీ సొత్తును తలా కొంత పంచుకున్న నిందితులు ఢిల్లీతో పాటు ఇతర నగరాలకు పారిపోయారు. మహేష్ షాహీ, అప్సర పోలీసుల కళ్లుగప్పి సరిహద్దు దాటారు. దాదాపు 10 రోజులు వారికోసం కాపుకాసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నేపాల్ వెళ్లి నిందితులను పట్టుకున్నారు. స్థానిక కోర్టులో వారిని హాజరుపర్చిన అనంతరం విచారించగా చోరీ సొత్తులో కొంతభాగం తీసుకుని నరేష్ అనే వ్యక్తి ఢిల్లీకి వెళ్లాడని తేలడంతో అతడిని సైతం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహేష్ షాహీ, అప్సర ఇద్దరూ సహజీవనం చేస్తున్నారని.. చోరీ స్కెచ్‌లో భాగంగా భార్యాభర్తలుగా సంపన్నుల ఇంట్లో ప్రవేశిస్తుంటారని పోలీసుల విచారణలో తేలింది. కాగా చోరీలో పాల్గొన్న మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసుల వేట కొనసాగుతోందని తెలుస్తోంది. చోరీ అయిన సొత్తులో కొంత రికవరీ అయినప్పటికీ ఎక్కువ సొత్తు ఇంకా లభ్యం కాకపోవడంతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

## నేటినుంచి బ్యాంకులకు మూడ్రోజుల సెలవులు

బ్యాంకులకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు రాబోతున్నాయి . శుక్రవారం, శనివారం, ఆదివారాల్లో బ్యాంకులు పని చేయవు. శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం సెలవు. అలాగే నాలుగో శనివారం, ఆదివారాల్లో బ్యాంకులు తెరుచుకోవు. దీంతో సోమవారమే బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయి. చెక్ క్లియరెన్స్‌లు, డాక్యుమెంట్ సబ్మిషన్, ఇతర వ్యక్తిగత సేవల కోసం బ్యాంకులకు వెళ్లాలనుకుంటే సోమవారం వరకు ఆగాల్సిందే.

## మొక్కజొన్న కొనుగోలు చేయండి

**- సిపిఎం నాయకుల ధర్నా**

మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో చింతకాని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మొక్కజొన్నకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా మొక్కజొన్న గింజను కొనుగోలు చేయాలని ఆయన కోరారు. అనంతరం తహసీల్దార్ బాబ్జి ప్రసాద్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో సీపీఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు, సీనియర్ నాయకులు వత్సవాయి రాములు, మద్దిని బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ పేరుతో మోసాలు

**- ముఠాను అరెస్ట చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు**

ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. రాజేశ్ వెంకట్ రామన్, అభిషేక్, విలియమ్స్, మన్మీత్ శర్మ ముఠాగా ఏర్పడి రూ.26 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. నకిలీ పేమెంట్ గేట్‌వేలను నిందితులు తయారు చేసినట్లు విచారణలో వెల్లడైంది. యూపీఐ, ఐఎంపీఎస్ కార్డ్ ట్రాన్సాక్షన్‌ల ద్వారా డబ్బులు మళ్లించినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. ప్రతి లావాదేవీపై 2 శాతం నుంచి 5శాతం వరకు కమిషన్ వసూలు చేసినట్లు గుర్తించారు. ఫేక్ కంపెనీల పేర్లతో మ్యూల్ ఖాతాలు సృష్టించి, నగదు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. సూర్యోదయ బ్యాంక్ ద్వారా పేమెంట్ గేట్‌వే సేవలు వినియోగించినట్లు ఆధారాలు సేకరించారు. నిందితుల నుంచి 4 ల్యాప్‌టాప్‌లు, 6 మొబైల్స్, 9 చెక్‌బుక్‌లు, రూ.6.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరికొంత మంది నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

-----

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం మార్చి 27, 2026

# పిచ్చి బంగారు లోకం

## జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న సోషల్ మీడియా వ్యామోహం

**కరపత్రం ప్రతినిధి,కోరుట్ల**
జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో యూట్యూబర్ వైష్ణవిని.. వరకట్న వేధింపులతో తన భర్తే పొట్టనబెట్టుకోవడం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన వార్త ఈ మధ్యన సంచలనం రేపింది.

▪ **బలైన పిచ్చి బంగారు తల్లి**
ఆమె పిచ్చిలోకానికి వాడ్ని హీరోను చేసి, విలన్‌గా చూపి.. హంతకుడిగా మార్చి.. జీవితాన్ని కోల్పోయింది.

▪ **అమాయకత్వపు వ్యామోహం**
ఎంతటి అమాయకత్వం ఆమెది. ఇప్పటికీ ఇంకా ఇలాంటి అమ్మాయిలున్నారా? అనిపించేంత.. ఎంత వరకు చదువుకున్నదో తెలియదు.ప్రతీది యూట్యూబ్‌లోకి ఎక్కియ్యాలనేది మాత్రం ఆమె మైండ్‌కెక్కించుకున్నది.

▪ **ఆ మాట్లాడే తీరు.. విషయం.. ఆమెకు అవగాహన లేదని, అమాయకురాలని, సోషల్ మీడియాకు అడిక్ట్ అయ్యిందని**



**అర్థమైతుంది**

వాడు ఆమెను నిజంగానే ప్రేమించాడు..ఆమె ముఖంలో అమాయకత్వము ఉంది.అతని ముఖంలోనూ అమాయకత్వం ఉంది.

▪ **కానీ వాడెందుకు హంతకుడయ్యాడు? ఆ ప్రేమంతా నటనేనా?**
నిజంగా వరకట్నమేనా ఆమె హత్యకు కారణం?

▪ **ఎన్నో ప్రశ్నలు, ఎన్నో అనుమానాలు. యూట్యూబ్‌లో రీల్ చేస్తే 30 లక్షల అప్పు తీర్చుతుందా?**
ఆమె తల్లే అన్న మాట ఇది.

▪ **నా బిడ్డె నా అప్పులు తీర్చుతానన్నది అని.**

**అంటే.. ఎంతగా ఆ అమ్మాయిని ఎంకరేజ్ చేశారో.. ఎంతలా ఆమెను ఆ ఊబిలోకి తమంతటగా తాము చూస్తూ నెట్టేశారో తెలిసిపోతుంది**

దాదాపు యాభైవేల మంది సబ్‌స్క్రైబర్లున్నారంట. ఈ పిచ్చి వీడియోలు. ఏది పడితే అది చూసి లైకులు కొట్టి, కామెంట్లు పెట్టేవారంటే అదో పిచ్చిలోకమనే చెప్పాలి. ఆ పిచ్చిలోకంలోకి అతడు కూడా ఎంట్రీ ఇచ్చాడు.ఆ వీడియోలు తీసి వాడెంతో సంతోషపడ్డాడు. అబ్బ ఎంత బాగుందీ జీవితం..

▪ **నేనో హీరో, ఆమె నా హీరోయిన్.. మేమేం చేసినా చూసే జనం.. మా వీడియోల కోసం ఎదురుచూసి ఎగబడే మా మందీమార్బలం.. అనుకున్నారు**

ఆలోకంలో ఇద్దరూ విహరించారు.చిన్న చిన్న మనస్పర్ధలు, అనుమానాలు.ఇది ఇంట్లో కూర్చుని మాట్లాడుకుని సెట్ చేసుకోవాల్సినవి.

▪ **అమ్మాయి వయస్సు చిన్నది. అర్థం చేసుకునేంత మెచ్యూరిటీ లేదు. మరీ చిన్నతనంలోనే పెండ్లీలు చేయొద్దనేది కూడా అందుకే చెప్పేది**

అప్పటిదాకా హీరోను చేసిన వాడ్ని...ప్రాంక్ పేరుతో విలన్‌గా చూపించింది.

▪ **ఇదిగో ఇది వీడి నిజస్వరూపమని తన పిచ్చిలోకం ముందుంచింది. అట్లైతే వాడు దారికొస్తాడని, తనకు భయపడతాడని, ఇలా భయపెడుతూ వాడిని మార్చుకోవాలనే ఆ చిన్న మనసు ఆలోచన కావొచ్చు**

కానీ వాడి ఆలోచన మారింది.
తను నిన్నటి వరకు ఆమె సృష్టించుకున్న లోకానికి హీరో. ఆమెను పెండ్లి చేసుకున్న భర్త. ఇప్పుడు ఆమే వాడ్ని విలన్ చేసింది. ఇక తట్టుకోలేకపోయాడు.

▪ **అప్పటి వరకు ఆమె సాంగత్యం స్వర్గం..**

**ఆ తరువాత నుంచి ప్రతీ క్షణం నరకం. పర్సనల్‌గా మాట్లాడే ముచ్చట లేదు.ముచ్చట్లన్నీ యూట్యూబ్‌లోనే. కోపాలు, ఆవేశాలు, తమ అపరిపక్వ నిర్ణయాలు, బెదిరింపులు**

▪ **అన్నీ అన్నీ అందులోనే. వాడో సైకో అయ్యాడు. హంతకుడూ అయ్యాడు. ఆమె బలైంది. ఆ చంపే వీడియో కూడా పెడితే బాగుందని అనుకుంటున్నది ఆమె సృష్టించుకున్న ఆ పిచ్చిలోకం**

ఇది అపరిపక్వ యువత తీరు..సోషల్ మీడియా వ్యామోహం మాయ.వ్యక్తిగత జీవితాన్ని రీల్స్ లో కప్పిపెట్టిన న్యూ జెన్ తీరు..జీవితం విలువైనదని తెలియని భ్రమల్లో గడుపుతున్న యువతను మార్చేదెవరు? ఇది ఒక మామూలు హత్య కాదు.సోషల్ మీడియా వ్యామోహం చేస్తున్న హత్యలు ఇవి.
అధికారులు,సామాజిక బాధ్యత కలిగిన పెద్దలు సీరియస్ గా ఆలోచించాల్సిన సంఘటన ఈ బంగారు తల్లి వైష్ణవి హత్య..

## నవోదయలో సీటు సాధించిన నవదీప్ కు ఘన సన్మానం



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన జక్కుల నవదీప్ యాదవ్ నవోదయ ప్రవేశ పరీక్షలో సీటు సాధించారు. ఈ సందర్భంగా, మల్లాపూర్ మండల అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు సంగ గంగరాజం, జిల్లా కార్యదర్శి ధన రేకుల సంతోష్ యాదవ్, గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో నవదీప్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెట్టుపల్లిలో సామూహిక హనుమాన్ చాలీసా




**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా, కోరుట్ల నియోజకవర్గంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం మెట్టుపల్లి పట్టణంలోని =జ బస్ స్టేషన్ ఇన్ గేట్ వద్ద గల హనుమాన్ ఆలయం వద్ద సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి, బిజేవైఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## తల్లిని చంపిన కూతురు

▪ **ప్రియుడితో కలిసి ఇంట్లో పాతిపెట్టిన దారుణం**

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో తల్లిని హత్య చేసి మృతదేహాన్ని పాతిపెట్టిన దారుణ ఘటన ఏడాది తర్వాత వెలుగులోకి వచ్చింది. కూతురు ఇషికా, ఆమె ప్రియుడు మౌంటీ రాజ్‌పుత్ కలిసి తల్లిని హత్య చేసి, మృతదేహాన్ని ఇంట్లోనే పాతిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. తల్లి కనిపించడం లేదని, బైక్ కూడా మిస్ అయిందని ఏడాది క్రితం కూతురు ఫిర్యాదు చేసింది. అయితే, మార్చి 24న బైక్‌ను విక్రయించేందుకు ప్రియుడు ప్రయత్నించగా పోలీసులకు సమాచారం అందింది. విచారణలో ఈ దారుణం బయటపడటంతో ఇద్దరినీ పోలీసులు అరెస్ట్ చేశారు.



## మహిళ దారుణ హత్య

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
హైదరాబాద్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి దమ్మాయిగూడలో దారుణ హత్య జరిగింది. ఓ మహిళను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి, మృతదేహాన్ని చెట్ల పొదల్లో పడేశారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. రక్తపు మడుగులో పడి ఉన్న మహిళ మృతదేహాన్ని పరిశీలించగా ఆధారాలు దొరకలేదు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## వేంపేట్ లో శ్రీరామనవమి

▪ **అఖండ నామ సంకీర్తన**



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
వేంపేట్ లో శ్రీరామనవమి: అఖండ నామ సంకీర్తన, ఆధ్యాత్మిక ప్రవచనాలు మెట్ పల్లి మండలం, వేంపేట్ గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం అఖండ నామ సంకీర్తన జరిగింది. ఉదయం ఆరు గంటల నుండి భగవద్గీతలోని ఆరవ అధ్యాయం నుండి 12వ అధ్యాయం వరకు పారాయణం చేశారు. అనంతరం జరిగిన మహాసభలో శ్రీ సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి ఆచార్య శ్రీహరి తీర్థ స్వామి, మాత పరమేశ్వరి, మాత హరిప్రియ, శివరామకృష్ణ తపోవనం పీఠాధిపతులు శ్రీ విరజానంద తీర్థ స్వామి ప్రవచనాలు చేశారు. పలువురు మహాత్ములు రాముని గుణగణాలను వివరించారు.

## కోరుట్ల రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

**కరపత్రం ప్రతినిధి, కోరుట్ల**
కోరుట్ల పట్టణంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన కళ్లెం లింగవ్వ (63) మృతి చెందింది. జవహర్ నవోదయ స్కూల్ ముందు రోడ్డు దాటుతున్న ఆమెను, కోరుట్ల నుండి వేములవాడ వైపు అతివేగంగా వస్తున్న హీరో గ్లామర్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన లింగవ్వను స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించింది.



## కోరుట్ల మున్సిపల్ చైర్మన్‌కు ఘన సన్మానం



**కరపత్రం ప్రతినిధి, కోరుట్ల**
జగిత్యాల జిల్లా, కోరుట్ల పట్టణంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్‌ను సాల్వతో గురువారం సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కనక లక్ష్మణ్, అచ్చ శ్రీనివాస్, బాజోజి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పంట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



▪ **పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు కొమ్మిడి స్వర్ణలత**

**కరపత్రం ప్రతినిధి మంథని మార్చి 26**
మంథని మండలం ఆరెంద గ్రామానికి చెందిన కొమ్మిడి స్వర్ణలత సొంత భూమిలో వరి పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంథని మండలం అరెంద గ్రామం సర్వేనెంబర్ 39,40 లలో మూడు ఎకరాల వరి పంట సాగు చేస్తుండగా శంకర పల్లె గ్రామానికి చెందిన దాశెట్టి జయసుధ దాశెట్టి తిరుపతి అనే వ్యక్తులు కొమ్మిడి శంకర్ సహాయంతో తమ వరి పంట పొలాన్ని బుధవారం రాత్రి టాక్టర్ తో పంటను పూర్తిగా ధ్వంసం చేశారని బాధితురాలు తెలిపారు.బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంథని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. పోలీసులు రెవెన్యూ అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే అరెస్టుల




**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, మార్చి 26:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులకు పాల్పడటం సరైన విధానం కాదని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డి వై ఎఫ్ ఐ ) మాజీ జిల్లా అధ్యక్షుడు వడ్లూరి కిషోర్ తీవ్రంగా విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలు, 420 హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, యువతకు హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి అమలు చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన “చలో అసెంబ్లీ” కార్యక్రమాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం నేపథ్యంలో ముందస్తు చర్యల పేరిట వడ్లూరి కిషోర్‌ను జమ్మికుంటలో పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలపై ప్రశ్నించడం ప్రతి పౌరుని హక్కు అని, అలాంటి ప్రశ్నలను అణిచివేయడానికి అరెస్టులు చేయడం అనేది అనుచితమని అన్నారు.
గత రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, బడ్జెట్‌లో యువత కోసం తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు.

# విద్యుత్ కార్మికుల డిమాండ్ల సాధన కోసం హుజురాబాద్‌లో ధర్నా

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, మార్చి 26:**
తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ పిలుపు మేరకు గురువారం (26-03-2026) రాష్ట్రవ్యాప్తంగా అన్ని డివిజన్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించగా, హుజురాబాద్ డివిజన్ కార్యాలయం ఎదుట కూడా భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ ధర్నాలో ఆర్టిసన్ కార్మికులు, అనుమ్యాన్ కార్మికులు, ఎస్పీఎం వర్కర్లు, పీస్‌రేట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను గళమెత్తి వినిపించారు.





కార్మికులు తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. ఆర్టిసన్ కార్మికులకు ఏపీఎస్‌ఈబీ ( ఏ పి ఎస్ ఇ బీ ) నిబంధనలు వర్తింపజేయాలని, అనుమ్యాన్ కార్మికులను ఆర్టిసన్‌లుగా గుర్తించాలని, పీస్‌రేట్ కార్మికులకు జి.ఓ. నం.11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, విధుల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒకరికి ఉద్యోగం కల్పించాలని వారు కోరారు.
ఈ సందర్భంగా ఆర్టిసన్ కార్మికులు పంజాల శ్రీనివాస్, ఉప్పల్ రవి మాట్లాడుతూ, తాము 15-20 సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో కష్టపడి పనిచేస్తున్నప్పటికీ ఇప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమని తెలిపారు. విధులు నిర్వహించే సమయంలో పలువురు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని, అయినా సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.
అనుమ్యాన్ కార్మికులు వెంకటేష్, శివ, రవి, శ్రవణ్, రాజు, శ్రీను తదితరులు మాట్లాడుతూ, తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి సరైన వేతనాలు, భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో మరింత ఉగ్రరూపంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.
ఈ ధర్నా కార్యక్రమంలో హుజురాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్‌లకు చెందిన కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు యూనియన్ నాయకులు స్పష్టం చేశారు.
డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం -- యూనియన్ హెచ్చరిక
చివరగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ, సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ఇకపై నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలు, ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని వారు తెలిపారు.

# జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కు మూడు రోజులు సెలవు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 26**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం ఒక ప్రకటనలో సమస్త రైతు సోదరులు, అక్తి మరియు పత్తి వ్యాపారస్తులు, గుమస్తాలు, హమాలీలు, దాడువాయి కార్మికులు, ట్రాక్టర్--ట్రాలీ డ్రైవర్లకు ముఖ్య సమాచారం తెలియజేశారు. "శ్రీరామ నవమి పండుగ" సందర్భంగా మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ఉంటాయని తెలిపారు.
సెలవుల వివరాలు ఇలా ఉన్నాయి:
27.03.2026 (శుక్రవారం): శ్రీరామ నవమి సందర్భంగా ప్రభుత్వ సెలవు
28.03.2026 (శనివారం): వారాంతపు మార్కెట్ యార్డు సెలవు
29.03.2026 (ఆదివారం): సాధారణ సెలవు
కావున 27 నుండి 29 మార్చి వరకు మొత్తం మూడు రోజులు మార్కెట్ యార్డు మూసివేయబడుతుంది. తిరిగి 30.03.2026 (సోమవారం) నాడు మార్కెట్ యార్డు పునఃప్రారంభమవుతుంది. అందువల్ల రైతు సోదరులు పై తెలిపిన సెలవు రోజుల్లో తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తీసుకురాకుండా ముందస్తుగా ప్రణాళికలు చేసుకోవాలని చైర్మన్ స్వప్న సదానందం విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ పాలకవర్గ అత్యవసర సమావేశం.. 32 అంశాలు ఆమోదం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, మార్చి 26:**
జమ్మికుంట మున్సిపాలిటీ పాలకవర్గ అత్యవసర సమావేశం గురువారం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన, కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 32 కీలక అంశాలను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది.
వేసవి కాలంలో నీటి ఎద్దడి సమస్యను దృష్టిలో ఉంచుకుని బోర్‌వెల్‌ల మరమ్మత్తులు, అదనపు వాటర్ ట్యాంకుల ఏర్పాటు, తాగునీటి సరఫరా మెరుగుదలపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. పారిశుధ్య సేవలను బలోపేతం చేయడం, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మరియు 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపుకు కూడా ఆమోదం తెలిపారు.



అదనంగా నగరాభివృద్ధి కోసం అన్ని పార్కుల్లో లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు, కొత్త స్ట్రీట్ లైట్ల కొనుగోలు, హమాలి సంఘ కార్మికుల కోసం టాయిలెట్ బ్లాక్ నిర్మాణం వంటి అంశాలను కూడా ఆమోదించారు.
ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్, చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, వార్డు కౌన్సిలర్లు సూచించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. పారిశుధ్య కార్మికులను రెండు వార్డులకు కాకుండా మూడు వార్డులను ఒకేసారి కవర్ చేసేలా గ్యాంగ్ వర్క్ విధానంలో కేటాయించి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.
జమ్మికుంట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రతి వార్డులో ఉన్న సమస్యలను పాలకవర్గ సమక్షంలో పూర్తిగా పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.
ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ, ఎ.డి. అహ్మద్, మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, జె.ఏ.ఓ రాజశేఖర్ రెడ్డి, ఏఈ వికాస్, టీపీఓ శ్రీధర్, రాజ్‌కుమార్, దీపిక, సీనియర్ అసిస్టెంట్ వాణి, ఆర్.ఐ భాస్కర్, ఎస్.ఐ మహేష్‌తో పాటు మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ముగిసిన ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మార్చి 26**




కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన వివేకానంద డిగ్రీ , పీజీ కళాశాల జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరం నేటితో ముగిసింది అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఏడు రోజుల పాటు శ్రమదానం,పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలను , సామాజిక అవగాహన ర్యాలీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేయాలని , రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్, ఏ.సి. ఓ.బి.సంపత్ కుమార్, ఏ.ఓ.బి.శ్రవణ్ కుమార్,ఎన్ఎస్ఎస్ మాజీ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆర్ గోపి కృష్ణ, డాక్టర్ ఎండి. అలీ ఖాన్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డి. సాగర్, బి. మహేష్, ఎన్. శ్రీనివాస్, డాక్టర్ ఎంఏ. సలీం అధ్యాపక బృందం , ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయదు..ప్రణవ్..

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ మార్చి 26**

**- డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.**
**- ఇప్పటికే మంత్రులకు ఉన్నత అధికారుల దృష్టికి ఈ సమస్యపై వివరణ.**
**- త్వరలో సీఎంను కలుస్తా,శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తా.**

ప్రజా వ్యతిరేక పనులను కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏరోజు చేయబోదని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గత మూడు రోజులుగా డంపింగ్ యార్డ్ రద్దు కోసం అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్షలకు సంఘీభావం తెలుపుతూ గురువారం రోజున హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన నిరసన దీక్షలో ఆయన పాల్గొన్నారు. కాసేపు వారితో కలిసి దీక్షస్థలిపై





కూర్చున్నారు. ఈ సమస్యకు ప్రణవ్ వారధిగా ఉండి పరిష్కారం చూపెట్టాలని అఖిలపక్ష నాయకులు కోరారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ పెద్దలకు ఈ సమస్యపై వివరించామని ప్రజలకు హాని చేసే ఏ పనిని అయినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒప్పుకోదని,డంపింగ్ యార్డు వలన ప్రజలకు తలెత్తే సమస్యలను అధికారులకు వివరించామని,వివిధ కార్పొరేషన్,మున్సిపల్ నుండి వచ్చే చెత్త వలన చెడు పరిమాణాలు ఎదురవుతాయని అన్నారు. హుజూరాబాద్ డంపింగ్ యార్డు వద్దని జనాలు నివాసం లేని చోట నిర్మించుకోవాలని సూచించమని అన్నారు. ఈ ప్రతిపాదన 2022 లోనే చేశారని అప్పుడే అప్పటి నాయకులు అడ్డుకుంటే ఈ పరిస్థితి ఉండబోయేదని అన్నారు. ఈ సమస్య పార్టీలకు అతీతంగా సామరస్యంగా హుజూరాబాద్ భవిష్యత్ కోసం కృషి చేయాలని,దీనికోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ కలుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు,ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శిశుమందిర్ లో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మార్చి 26**



శ్రీ రాముని మహోన్నత గుణాలను స్మరించుకుంటూ, ఆయన ఆదర్శాలను ఆచరణలో పెట్టే సంకల్పంతో శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధర్మానికి ప్రతీకగా నిలిచిన శ్రీ రాముడు సత్యం, కర్తవ్యనిష్ఠ, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను ప్రపంచానికి చూపించాడు. అదే విధంగా శ్రీ సరస్వతీ విద్యాపీఠం విద్యతో పాటు విలువలను బోధిస్తూ, సమాజానికి ఆదర్శ పౌరులను తీర్చిదిద్దడంలో విశేష పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శ్రీ సరస్వతీ విద్యాపీఠం పరిధిలో 176 పాఠశాలలు, 44,000 మంది విద్యార్థులు, 2,600 మంది ఉపాధ్యాయులు , సిబ్బంది, 5 లక్షలకు పైగా పూర్వ విద్యార్థులతో విశాలమైన విద్యా వృక్షంగా ఎదిగి దేశ అభివృద్ధికి తోడ్పడుతోంది అని వక్త ఎలగందుల సత్యనారాయణ ఉద్ఘాటించారు.
కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం , శిశుమందిర్ పాఠశాలలు భవిష్యత్తులో కూడా విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి కట్టుబడి పనిచేస్తాయని పాఠశాల ప్రధానాచార్యులు రణధీర్ తెలిపారు.
ఈ కార్యక్రమం లో ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, మెచినేని దేవేందర్ రావు, తాటి రాజేశ్వర్ రావు, కొత్తూరి ముకుందం, శ్రీరామోజు రవి, గట్టు రాంప్రసాద్, ఆచార్యులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఎల్ఐసి ఏజెంట్ల పాత్ర కీలకం..ప్రణవ్..

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ మార్చ్ 26**
**- ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.**
**- బిల్డింగ్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం..**
**- ప్రతీ కుటుంబానికి ఆర్థిక భరోసా అవసరం.**

సమాజంలో ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఎల్ఐసి ఏజెంట్ల పాత్ర కీలకమైందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం రోజున హుజూరాబాద్ పట్టణంలో ఎల్ఐసి ఏజెంట్ల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏజెంట్లు ఘన స్వాగతం పలికి,శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటితో,కుటుంబంతో ఎల్ఐసి



ఏజెంట్లకు మంచి సంబంధాలు కలిగి ఉంటాయని,వారికి మాజీ రాజ్యసభ సభ్యులు వొడితల రాజేశ్వర్ రావు ఎల్ఐసి బిల్డింగ్ నిర్మాణం కొరకు స్థలం కేటాయించారని,ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్డింగ్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. అంతే కాకుండా



ఏజెంట్లకు సంబంధించి ఏవైనా సమస్యలు నా దృష్టికి వస్తే వాటిని పరిష్కారం చేయడానికి నా వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,ఎల్ఐసి ప్రతినిధులు,ఏజెంట్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# లక్ష్మీనగర్ లో అరైవ్ అలైవ్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 26:**
అరైవ్ అలైవ్ 2026 ఫేస్ 3లో భాగంగా రహదారి భద్రత మరియు నియమాలు పాటించుట 3వ దశ, రాష్ట్రవ్యాప్తంగా మార్చి 25 నుండి 31వ తేదీ వరకు నిర్వహించబడుతుంది. మన రామగుండం కమిషనరేట్ పరిధిలో రహదారి భద్రతను పెంపొందించడానికి, కమిషనర్ ఆఫ్ పోలీస్ రామగుండం ఆదేశాల మేరకు సి.హెచ్. శ్రీనివాస్ ట్రాఫిక్ ఏసీపి, రామగుండం ఆదేశానుసారం. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి.రాజేశ్వరరావు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామగుండం ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీ నగర్ ఏరియాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ



వాహనం నడిపేటప్పుడు ఓవర్‌టేక్ చేసేటప్పుడు రైట్ సైడ్ నుంచి మాత్రమే ఓవర్టేక్ చేయవలెనని, పార్కింగ్ ప్లేస్లో చేయాలని పార్కింగ్ వాహనదారులకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ చేయాలని లక్ష్మీ నగర్ లోని వర్తక వ్యాపారులకు ప్రజలకు సూచించారు. వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఉంచుకోవాలని. మద్యం తాగి వాహనం నడపరాదని ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.హరి శేఖర్, రామరాజు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎంతో సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం భేటీ

తెలంగాణ శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం కలిసింది. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను నిఖిల్ డే ప్రశంసించారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న ప్రజా వాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్ళేందుకు ఈ భేటీలో సమాలోచనలు జరిగాయి. అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాజస్థాన్ ప్రభుత్వం చేపడుతున్న జన్ సూచన పోర్టల్ తరహాలో తెలంగాణ లోనూ 'ప్రజా సూచన పోర్టల్ ' ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలకు సంబంధించిన వివరాలను ఒకే చోటఈ పోర్టల్ లో అందుబాటులో ఉంచుతారు.